ఐదేండ్లు నేనే సీఎం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): వచ్చే ఐదేండ్లు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, తానే సీఎంగా కొనసాగుతానని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కర్ణాటక కాంగ్రెస్‌లో 'సీఎం కుర్చీలాట' మొదలైందన్న వార్తల నేపథ్యంలో ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రెండున్నరేండ్ల తర్వాత ముఖ్యమంత్రిని మారుస్తారన్న వార్తలను కొట్టిపారేశారు. మరో ముగ్గురు డిప్యూటీ సీఎంలను నియమించనున్నారన్న వార్తలపై స్పందించిన సిద్ధరామయ్య.. ఈ విషయం ఎవరు చెప్పారంటూ మీడియాను ఎదురు ప్రశ్నించారు. సిద్ధరామయ్య వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. సీఎం మార్పు గురించి ఇకపై మాట్లాడబోనని చెప్పారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడుతానని వెల్లడించారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలివ్వండి

ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 2: ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు అందిన విరాళాల వివరాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2023 సెప్టెంబర్ 23నాటి వరకు అందిన విరాళాల వివరాలు అందులో పొందుపరచాలని, రెండు వారాల్లోగా సమాచారాన్ని అందజేయాలని నిర్దేశించింది. ఎన్నికల బాండ్ల పథకం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం తీర్పు వాయిదా వేసింది. 2019 వరకు బాండ్ల డాటా తమ వద్ద ఉందని ఈసీ తెలుపగా, అలా కాదు.. ధర్మాసనం ముందుకు ఎప్పుడు వచ్చినా తాజా సమాచారంతో రావాలని ఈసీకి సూచించింది.

ఫోన్ల హ్యాకింగ్‌పై యాపిల్‌కు

కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ, నవంబర్ 2: ప్రతిపక్ష ఎంపీల ఫోన్లు హ్యాకింగ్‌కు గురయ్యాయంటూ యాపిల్ సంస్థ ప్రమాద హెచ్చరికలు జారీచేయగా, ఈ వ్యవహారంపై కేంద్ర ఐటీ శాఖ విచారణకు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ 'సెర్ట్-ఇన్' నుంచి మొబైల్ తయారీ కంపెనీ యాపిల్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఈ మేరకు కేంద్ర ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ గురువారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. గోప్యత, భద్రతపై పదే పదే మాట్లాడే యాపిల్, హ్యాకింగ్‌పై 150కిపైగా దేశాల్లో ఫోన్ వాడుతున్న వారికి 'అలర్ట్ నోటిఫికేషన్లు' ఎందుకు జారీ చేసిందని, దీనిపై కంపెనీ స్పష్టత ఇవ్వాలని నోటీసులో 'సెర్ట్-ఇన్' పేర్కొన్నది.

పాప విముక్తి సర్టిఫికెట్ ఇస్తున్న గుడి

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లోని గొటమేశ్వర్ మహదేవ్ మందిర్ భక్తులకు పాప విముక్తి ధ్రువపత్రాన్ని ఇస్తున్నది. జంతువులను చంపినవారు, కుల బహిష్కరణకు గురైనవారు ఇక్కడి గంగా కుండంలో స్నానమాచరిస్తారు. అనంతరం ఈ దేవాలయం ట్రస్టు ఆ వ్యక్తికి పాప విముక్తి సర్టిఫికేట్‌ను జారీ చేస్తుంది. దీని కోసం రూ.12 వసూలు చేస్తుంది. అర్చకులు మాట్లాడుతూ, మహ్మద్ ఘజినీ శివలింగాన్ని ధ్వంసం చేయబోయాడని, తేనెటీగల గుంపు వచ్చి, సైనికులను తరిమికొట్టిందని చెప్పారు.

గెలుపు కోసం రాజస్థాన్ గుడికి పోటెత్తుతున్న నేతలు

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే నేతలు రాజస్థాన్‌లోని మా భగవతి దేవాలయానికి పరుగులు తీస్తున్నారు. శతాబ్దాల చరిత్రగల ఈ గుడి శక్తిపురి, శివపురి, విష్ణు పురి కోటల మధ్య ఉంది. అందుకే దీనిని మా త్రిపుర సుందరి దేవాలయం అని కూడా పిలుస్తారు. శ్రీ యంత్రం, 18 చేతులుగల ఈ అమ్మవారు రాజ్యాధికారాన్ని ఇస్తుందనే నమ్మకం ఉంది. అందుకే సర్పంచ్ సహా ఎంపీ, ఎమ్మెల్యే పదవుల కోసం పోటీ పడేవారు ఇక్కడికి వచ్చి, ప్రత్యేక పూజలు చేస్తూ ఉంటారు. 2013లో జరిగిన రాజస్థాన్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున బీజేపీ నేత వసుంధర రాజే సింధియా ఈ గుడిలోనే ఉండిపోయారు. రోజంతా ఇక్కడే ఉండి పూజలు చేశారు.

'అమృత్‌కాల్' ఇదేనా?!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్రమోదీ వల్లెవేసిన 'అమృత్ కాల్' భ్రమలు క్రమంగా వీడిపోతున్నాయి. దేశప్రగతికి సూచికలుగా నిలిచే ద్రవ్యోల్బణం, రూపాయి విలువ, ఉపాధి అవకాశాలు, ఎగుమతులు, ఫారెక్స్ నిల్వలు ఇలా పది అంశాల్లో భారత్ అంతకంతకూ దిగజారిపోతున్నది. ఇదీ తొమ్మిదిన్నరేండ్ల మోదీసర్కారు పాలనతీరు.

- కొండెక్కుతున్న ధరలు
- పడిపోతున్న రూపాయి
- ఆకాశానికి నిరుద్యోగం
- క్షీణిస్తున్న ఎగుమతులు
- పడకేసిన తయారీరంగం
- ఫారెక్స్ నిల్వలు పతనం

తొమ్మిదిన్నరేండ్ల బీజేపీ పాలనలో దేశం అధోగతి

పరిశ్రమల మూత

ప్రధాని మోదీ పాలనలో రోజుకు 300 చొప్పున ఏకంగా 10 లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతబడ్డట్టు నివేదికలు చెబుతున్నాయి. పారిశ్రామికాభివృద్ధి కుంటుపడుతున్నది. శ్రామికశక్తి నిర్వీర్యమవుతున్నది.

ద్రవ్యోల్బణం



ఆహారోత్పత్తుల ధరలు భగ్గుమంటున్నాయి. సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.02 శాతానికి చేరినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఏడాది వ్యవధిలో కూరగాయల ధరలు 62.12 శాతం పెరిగాయి. వాణిజ్య సిలిండర్ ధర రూ. 2 వేలకు చేరింది.

రూపాయి విలువ పతనం

బీజేపీ సర్కారు అసమర్థ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతున్నది. దాని ప్రభావం రూపాయిపై పడుతున్నది. దీన్ని ధ్రువపరుస్తూ.. బుధవారం ఫారెక్స్ మార్కెట్‌లో ఇంట్రాడేలో డాలర్‌తో రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ఠం 83.35కు పతనమైంది.

నిరుద్యోగం

ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్రంలోని మోదీ సర్కారు ఆ హామీని అటకెక్కించింది. అక్టోబర్‌లో నిరుద్యోగిత రేటు 10.05 శాతానికి ఎగబాకింది. రెండున్నరేండ్ల వ్యవధిలో ఇది అత్యధికమని సీఎంఐఈ తాజా నివేదికలో వెల్లడించింది.

తయారీరంగం

పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న డిమాండ్ వెరసి అక్టోబర్‌లో భారత తయారీ రంగం కార్యకలాపాలు గడిచిన 8 నెలల్లో ఎన్నడూ లేనంతగా దిగజారాయి. ఈ మేరకు బుధవారం పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) నివేదిక వెల్లడించింది.

ఎగుమతుల క్షీణత

దేశ ఆర్థిక పరిపుష్ఠతకు కీలకమైన ఎగుమతుల్లో క్షీణత అంతకంతకూ పెరుగుతున్నది. సెప్టెంబర్ నెలలో దేశీయ ఎగుమతులు 2.6 శాతం తగ్గి 34.47 బిలియన్ డాలర్లకు చేరాయి. ఏడాది వ్యవధిలో ఎగుమతుల్లో క్షీణత 23 శాతంగా నమోదైంది.

వాణిజ్యలోటు

దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం ఎంతకూ దిగిరావడంలేదు. కేంద్రం అసమర్థ విధానాలే దీనికి కారణం. ఒకవైపు దిగుమతులు ఆకాశాన్నంటుతుంటే, ఎగుమతులు క్షీణిస్తున్నాయి. ఫలితంగా వాణిజ్యలోటు 19.37 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ఫారెక్స్ నిల్వలు

విదేశీ మారక నిల్వలు ఆవిరైపోతున్నాయి. ఫారెక్స్ రిజర్వుల పతనానికి అడ్డుకట్ట వేయడానికి రిజర్వ్‌బ్యాంక్ చేసిన ప్రయత్నాలూ బెడిసికొడుతున్నాయి. విదేశీ మారకం నిల్వలు 2.36 బిలియన్ డాలర్లు కరిగిపోయి 583.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

విక్రయాలు



పెరిగిన ధరలు, ఉద్యోగుల్లో కోత వెరసి ప్యాసింజర్ వాహన విక్రయాలు అంతకంతకూ క్షీణిస్తున్నాయి. ఏడాది వ్యవధిలో విక్రయాలు 22.2 శాతం మేర మందగించినట్టు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. సాగుకు అవసరమైన ట్రాక్టర్ విక్రయాలు తగ్గుతున్నట్టు పేర్కొన్నాయి.

దళిత మహిళను రేప్ చేసి..

ముక్కలుగా నరికి

బీజేపీ పాలిత యూపీలో ఘోరం

లక్నో, నవంబర్ 2: బీజేపీపాలిత ఉత్తరప్రదేశ్‌లో దళితులకు, మహిళలకు రక్షణ లేకుండా పోతున్నది. గురువారం బాందాలో దారుణం చోటుచేసుకున్నది. దళిత మహిళపై కొంతమంది లైంగికదాడికి తెగబడటమేగాక, అనంతరం ఆమెను ముక్కలుగా నరికి పాశవికంగా హత్య చేశారు. గిర్వాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు వెల్లడించారు. 'ఫ్లోర్ మిల్ శుభ్రం చేయడానికి రాజ్‌కుమార్ శుక్లా ఇంటికి వెళ్లిన దళిత మహిళ (40) తిరిగి రాకపోయే సరికి, ఆమె కూతురు అక్కడి వెళ్లింది. ఇంట్లో ఓ గదిలో నుంచి ఆమె అరుపులు విని లోపలికి వెళ్లి చూసింది. కొంతసేపటి తర్వాత గది తలుపులు తెరిచిచూసే సరికి.. మూడు ముక్కలైన తన తల్లి శరీరాన్ని చూసి హతాశురాలైంది' అని స్టేషన్ పోలీస్ అధికారి సందీప్ తివారీ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రాజ్‌కుమార్, అతడి సోదరులు బావు శుక్లా, రామకృష్ణ శుక్లాలను నిందితులుగా పేర్కొంటూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవర్నీ అరెస్టు చేయలేదని, నిందితులు ముగ్గురు పారిపోయారని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై విపక్ష ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్విట్టర్ (ఎక్స్)లో స్పందిస్తూ, 'బాందాలో జరిగిన ఈ ఘటన మనసు తీవ్రంగా కలిచివేసింది. ఉత్తరప్రదేశ్ మహిళలు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు' అని అన్నారు.

డబుల్ ట్రబుల్ ఇంజిన్

ఉజ్జయినిలో మరో ఘోరం

- పదేండ్ల బాలికపై లైంగికదాడి
- అర్ధనగ్నంగా నడుచుకుంటూ ఇంటికెళ్లిన బాధితురాలు
- మధ్యప్రదేశ్‌లో దారుణం

ఉజ్జయిని: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లాలో మరో ఘోరం చోటుచేసుకుంది. నెల రోజుల కిందట ఉజ్జయినిలో లైంగిక దాడి ఘటన మరువకముందే తాజాగా అదే తరహాలో మరో ఘటన చోటుచేసుకుంది. పట్టపగలు ఓ వ్యక్తి పదేండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. గత నెల 31న ఈ ఘటన జరుగగా తాజాగా వెలుగులోకి వచ్చింది. వివాహితుడు తన ఇంట్లోని షెల్ఫ్‌లో కొన్ని వస్తువులను తీయడానికి సాయం చేయాలని బాలికను పిలిచి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దాడి అనంతరం అర్ధనగ్నంగా బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు, ఆమె తల్లిదండ్రుల వాంగ్మూలం రికార్డు చేసిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

నీచమైన ప్రశ్నలడిగారు

ఎథిక్స్ కమిటీపై మహువా ధ్వజం

న్యూఢిల్లీ: పార్లమెంటు ఎథిక్స్ కమిటీపై బెంగాల్ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్ర తీవ్ర ఆరోపణలు చేశారు. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి ముడుపులు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ విచారణకు గురువారం మహువా హాజరయ్యారు. అయితే విచారణ మధ్యలోనే మహువా, కమిటీలోని విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. 'ఇదేం సమావేశం? వారంతా నీచమైన ప్రశ్నలు అడిగారు' అని మహువా విలేకర్లతో వ్యాఖ్యానించారు. 'నీ కళ్లలో నుంచి నీళ్లు వస్తున్నాయి' అన్నారు. నా కళ్లల్లో నీళ్లు ఉన్నాయా? చూడండి?' అని అన్నారు. సమావేశంపై ఆమె లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. ఎథిక్స్ కమిటీ చైర్మన్ సోన్‌కర్ విచారణ సందర్భంగా తనను మాటలతో వస్త్రాపహరణం చేశారని ఆరోపించారు. వీటిని కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ వినోద్ సోన్‌కర్ ఖండించారు.

వారణాసిలో బీహెచ్‌యూ విద్యార్థినిపై లైంగిక వేధింపులు

హాస్టల్ దగ్గర దుస్తులిప్పి వీడియో తీసిన దుండగులు

వారణాసి: ప్రధాని సొంత నియోజకవర్గం వారణాసిలోని ఐఐటీ-బీహెచ్‌యూ ప్రాంగణంలో దారుణం చోటుచేసుకొంది. ముగ్గురు వ్యక్తులు ఓ విద్యార్థినిని ఆమె ఉండే వసతి గృహం సమీపంలోనే వేధించి, దుస్తులు తొలగించి వీడియో తీశారు. బాధితురాలి కథనం ప్రకారం బుధవారం రాత్రి ఆమె ఒక స్నేహితుడితో కలిసి హాస్టల్‌కు దగ్గరలో ఉన్న కర్మన్ బాబా దేవాలయానికి వెళ్లింది. అక్కడకు మోటార్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా ఒక మూలకు తీసుకెళ్లి ఆమె దుస్తులు విప్పి ఫొటోలు, వీడియో తీశారు. ఫోన్ నెంబర్ తీసుకొని వదిలిపెట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై గురువారం వందలాది మంది బీహెచ్‌యూ విద్యార్థులు ధర్నాచేశారు. బయటి వ్యక్తులను వర్సిటీ ప్రాంగణంలోకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. 'ఐఐటీ లాంటి ఉన్నత విద్యా సంస్థలు సురక్షితం కాదా? ప్రధాని నియోజకవర్గంలో ఒక విద్యార్థిని భయం లేకుండా సంచరించలేదా?' అని కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ ప్రశ్నించారు.

షోలాపూర్‌లో మనోజ్ జరాంగే మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న మరాఠా కోటా మద్దతుదారులు

రెండు నెలల్లో తేల్చండి

మరాఠా కోటాపై షిండే సర్కారుకు అల్టిమేటం

ఆమరణ దీక్ష విరమించిన మనోజ్ జరాంగే

జల్నా, నవంబర్ 2: మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ ఉద్యమిస్తున్న సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే ఆమరణ నిరాహార దీక్ష విరమించారు. పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి డిసెంబర్ 24ను డెడ్‌లైన్‌గా ప్రకటించారు. రెండు నెలల్లో నిర్ణయం తీసుకోకపోతే భారీస్థాయిలో ఉద్యమం చేపడతామని బీజేపీ-శివసేన సంకీర్ణ సర్కార్‌ను హెచ్చరించారు. రిజర్వేషన్లపై జరాంగే చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష గురువారం 9వ రోజుకు చేరుకుంది. నలుగురు రాష్ట్ర మంత్రులు జల్నాలోని అంతర్వాలి సారతి గ్రామానికి వెళ్లి, దీక్షను విరమించాలని జరాంగేను కోరారు. మంత్రుల విన్నపాన్ని గౌరవిస్తూ దీక్షను విరమిస్తున్నానని ఆయన ప్రకటించారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలో వివిధ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు గురువారం రాష్ట్ర సచివాలయం వద్ద తమ నిరసనను కొనసాగించారు. ఈ నేపథ్యంలో సచివాలయం వద్ద కొన్ని గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. రిజర్వేషన్లపై దారాశివ్ జిల్లాలోని పలు గ్రామాల్లో నిరసనకారులు 'జైల్ భరో' చేపట్టారు.

కాంగ్రెస్ వల్లే ఇండియా కూటమి బలహీనం: నితీశ్

పాట్నా, నవంబర్ 2: కాంగ్రెస్ పార్టీకి ఐదు రాష్ట్రాల ఎన్నికలపై ఉన్న శ్రద్ధ ఇండియా కూటమి బలోపేతంపై లేదని బీహార్ సీఎం నితీశ్‌కుమార్ విమర్శించారు. గురువారం ఆయన పాట్నాలో జరిగిన సీపీఐ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ నియంతృత్వ పాలనపై పోరాడటానికి తామంతా కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డామని చెప్పారు. కానీ మొదట ఉన్న ఊపు తర్వాత లేకుండా పోయిందని, దీనికి కాంగ్రెస్ పార్టీనే కారణమని విమర్శించారు. కూటమి బలోపేతాన్ని వదిలేసిన కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసమే పాకులాడుతున్నదని మండిపడ్డారు.

ఏసీబీ వలలో ఈడీ అధికారి

- కేసు మాఫీకి 15 లక్షల లంచం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న

రాజస్థాన్ ఏసీబీ అధికారులు

నావల్ కిశోర్

జైపూర్, నవంబర్ 2: కేంద్ర ప్రభుత్వం చేతిలో పావుగా మారి రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్నదన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఇప్పుడు అవినీతి మరక అంటుకున్నది. ఈడీకి చెందిన ఓ అధికారి లంచం తీసుకుంటూ రాజస్థాన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లా బస్సీ గ్రామానికి చెందిన ఈడీ అధికారి నావల్ కిశోర్ మీనా మణిపూర్‌లోని ఈడీ జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. మణిపూర్‌లో నమోదైన ఓ చిట్‌ఫండ్ కేసును సెటిల్ చేసేందుకు గాను అతడు రూ.17 లక్షలు లంచం డిమాండ్ చేసినట్టు చెప్తున్నారు. నావల్ కిశోర్‌తోపాటు అతని సహచరుడు, రాజస్థాన్‌లోని ముండావర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాబూలాల్ మీనాను అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. చిట్‌ఫండ్ కేసులో నిందితునిగా ఉన్న వ్యక్తి ఆస్తులు జప్తు చేయకుండా, అతడిని అరెస్టు చేయకుండా ఉండేందుకు గాను రూ.17 లక్షలు ఇవ్వాలని నావల్ కిశోర్ డిమాండ్ చేశాడు. ఆ తరువాత కేసు కూడా మాఫీ చేస్తామని చెప్పాడు. లంచం సొమ్మును రాజస్థాన్‌కు తీసుకొచ్చి ఇవ్వాలని అన్నాడు. ఈ మొత్తం వ్యవహారంపై నిందితుడు రాజస్థాన్ ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. జైపూర్‌లో ఓ మధ్యవర్తి నుంచి నావల్ కిశోర్, బాబూలాల్ రూ.15 లక్షలు స్వీకరిస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వారిద్దరిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదుచేస్తామని ఏసీబీ అడిషనల్ డైరెక్టర్ హేమంత్ ప్రియదర్శి చెప్పారు. అందరిపై మోపినట్టుగానే తమ అధికారిపై కూడా హవాలా చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడతామని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

సమన్లు రాజకీయ ప్రేరేపితం

- వెంటనే వాటిని ఉపసంహరించుకోండి
- ఈడీకి కేజ్రీవాల్ లేఖ..విచారణకు గైర్హాజరు

న్యూఢిల్లీ, నవంబర్ 2: ఢిల్లీ మద్యం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరుకాలేదు. తనకు జారీ చేసిన సమన్లు రాజకీయ ప్రేరితంగా, అస్పష్టంగా, చట్ట విరుద్ధంగా ఉన్నందున వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని ఈడీకి రాసిన లేఖలో కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఆయన రాసిన లేఖను పరిశీలించిన ఈడీ.. విచారణకు త్వరలోనే మరో తేదీని నిర్ణయిస్తుందని భావిస్తున్నారు. కాగా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి కేజ్రీవాల్ గురువారం మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం చేయకుండా అడ్డుకోవడానికి బీజేపీ ప్రేరేపితంతో తనకు సమన్లు జారీ చేస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. పైగా తనకు పంపిన సమన్లు అస్పష్టంగా ఉన్నాయని, తనను సాక్షిగా పిలిచారా? లేక అనుమానితునిగానా? వ్యక్తిగత హోదాలోనా? ముఖ్యమంత్రి హోదాలోనా అన్న విషయాలు పేర్కొన లేదని విమర్శించారు. 'కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తామని వారు రోజూ బెదిరిస్తున్నారు. మీరు కేజ్రీవాల్‌ను భౌతికంగా అరెస్ట్ చేయొచ్చు. కానీ కేజ్రీవాల్ ఆలోచనలను మీరు ఎలా అరెస్ట్ చేయగలరు?' అని ఆయన ప్రశ్నించారు.

రాజస్థాన్ పీసీసీ చీఫ్ కుమారులకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ డోటాస్ర కుమారులు అభిలాశ్, అవినాశ్‌లకు ఈడీ సమన్లు ఇచ్చింది. గోవింద్ విద్యా శాఖ మంత్రిగా పని చేసిన కాలంలో రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ పేపర్ల లీకేజ్ కేసులో విచారణకు ఈ నెల 7, 9 తేదీల్లో హాజరు కావాలని ఆదేశించింది. గత నెల 26న ఈ తండ్రీకొడుకుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేసింది. స్వతంత్ర ఎమ్మెల్యే (ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థి) ఓం ప్రకాశ్ హుడియాపై కూడా ఈడీ దృష్టి సారించింది. సీఎం అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్‌ను ఈడీ గత నెల 30న ప్రశ్నించిన సంగతి తెలిసిందే. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘన కేసులో ఆయనను ప్రశ్నించింది.

ఢిల్లీ మంత్రి రాజ్‌కుమార్ ఇంట్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణ ఎదుర్కొంటున్న ఆప్ సీనియర్ నేతల జాబితాలోకి తాజాగా ఢిల్లీ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ చేరారు. ఆనంద్, మరికొందరి ఇళ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సోదాలు నిర్వహించింది. రూ.7 కోట్లకు పైగా కస్టమ్స్ సుంకాల ఎగవేత, అంతర్జాతీయ హవాలా లావాదేవీలకు పాల్పడినట్లు డైరెక్టరేట్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ దాఖలు చేసిన ఛార్జిషీటు ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తున్నది. డీఆర్ఐ ప్రాసిక్యూషన్ కంప్లయింట్‌ను స్థానిక కోర్టు విచారణకు స్వీకరించిన అనంతరం మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం ఈడీ రంగంలోకి దిగింది. కాగా, ఇప్పటికే ఆప్ సీనియర్ నేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్, సంజయ్‌సింగ్, కైలాశ్ గెహ్లాట్, అమనతుల్లా ఖాన్, విజయ్ నాయర్‌పై వివిధ కేసుల్లో కేంద్ర ఏజెన్సీలు దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే.

రూ.1,932గా ఉన్న ఫీజు రూ.23,968కు

డీయూ ఇంగ్లిష్ పీహెచ్‌డీ ఫీజు పెంపుపై నిరసనలు

న్యూఢిల్లీ, నవంబర్ 2: ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం పీహెచ్‌డీ కోర్సు ఫీజును ఒకేసారి ఏకంగా 12 రెట్లు పెంచడంపై విద్యార్థులు, అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది వరకు రూ.1,932గా ఉన్న ఫీజును యూనివర్సిటీ రూ. 23,968కి పెంచింది. మిగతా సబ్జెక్టుల పీహెచ్‌డీ ప్రోగ్రాముల ఫీజు మాత్రం సుమారు.4,400 ఉందని అధ్యాపకులు తెలిపారు. అయితే దీనిపై యూనివర్సిటీ అధికార యంత్రాంగం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఫీజు పెంపు నిర్ణయం విద్యను ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ చేయడమేనని డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ విమర్శించింది. ఫీజు పెంపును నిరసిస్తూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు లేఖ రాసింది. పెంచిన ఫీజు కూడా ఒక్క రోజులోనే చెల్లించాలని యూనివర్సిటీ కోరినట్టు విద్యార్థులు తెలిపారు.

గవర్నర్లపై న్యాయపోరాటం

- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్న విపక్ష పాలిత రాష్ట్రాలు
- తెలంగాణ బాటలో తమిళనాడు, పంజాబ్, కేరళ ప్రభుత్వాలు
- బిల్లుల ఆమోదంలో గవర్నర్ల అంతులేని జాప్యంపై ఆగ్రహం

స్టాలిన్

విజయన్

మాన్

న్యూఢిల్లీ, నవంబర్ 2: గవర్నర్ల తీరుపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు న్యాయపోరాటానికి దిగుతున్నాయి. బిల్లులను ఆమోదించకుండా అంతులేని జాప్యం చేస్తూ, ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి నిత్యం అడ్డంకులు సృష్టిస్తున్న గవర్నర్లకు ముకుతాడు వేయాలని సుప్రీంకోర్టు తలుపు తడుతున్నాయి. గవర్నర్ తమిళిసై తీరుపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయగా.. తాజాగా తమిళనాడు, పంజాబ్, కేరళ కూడా తెలంగాణ బాటలోనే నడుస్తున్నాయి.

రాజకీయ ప్రత్యర్థిలా గవర్నర్

గవర్నర్ ఆర్ఎన్ రవి రాజకీయ ప్రత్యర్థిలా వ్యవహరిస్తున్నారని, బిల్లులను ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని తమిళనాడు ప్రభుత్వం గత మంగళవారమే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లులు, నియామక ఉత్తర్వులు, రోజువారీ ఫైళ్లపై సంతకం చేయకుండా గవర్నర్ ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపించింది. నిర్దేశిత గడువులోగా బిల్లులను ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని అభ్యర్థించింది. పంజాబ్ గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బిల్లులకు ఆమోదం తెలుపకపోవడంపై కోర్టును ఆశ్రయించింది.

కేరళ ప్రభుత్వం కూడా..

కేరళ ప్రభుత్వం కూడా రాష్ట్ర గవర్నర్ మహమ్మద్ ఆరిఫ్ ఖాన్‌పై గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రజా ప్రయోజనాలు, సంక్షేమం ఇమిడి ఉన్న ఎనిమిది బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టారని కోర్టుకు తెలిపింది. ఇందులో మూడు బిల్లులను రెండేండ్లకు పైగా, మూడు బిల్లులను ఏడాదికిపైగా పెండింగ్‌లో ఉంచారని వివరించింది. 'బిల్లుల ఆమోదం, ఇతర విషయాల్లో తనకు సంపూర్ణ విచక్షణాధికారం ఇచ్చారని గవర్నర్ అనుకుంటున్నారు. ఆయనకు నచ్చినప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇది రాజ్యాంగాన్ని అణచివేయడమే' అని కేరళ ప్రభుత్వం పేర్కొంది.